క్లుప్తంగా

హాస్టల్ భవనంపై నివేదిక ఇవ్వండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

హొళగుంద: ఇంగళదహాళ్ బీసీ హాస్టల్ భవనాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులకు ఎంపీడీఓ ఆజాద్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి కొత్త నిర్ణయాలు తీసుకోలేదు. ఇంగళదహాళ్ బీసీ హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ ఏడాది కొనసాగించడం కష్టమని వార్డన్ చెప్తున్నారని, వెంటనే భవనాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని పీఆర్ ఏఈ సోమప్పకు ఎంపీడీఓ సూచించారు. సమావేశంలో ఎంపీపీ నూర్జహాన్‌బీ, డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెల్దుర్తి రేణుకా ఎల్లమ్మ తిరుణాల



వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి గ్రామ దేవత ఎల్లమ్మ తిరుణాల ఉత్సవాలు బుధవారం నుంచి ప్రా రంభం కానున్నాయి. ధర్మకర్తలు బొమ్మన వంశీయుల ఆధ్వర్యంలో, నేశ కులస్తుల అర్చకత్వంలో 22న ఉదయం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్నారు.సాయంత్రం గ్రామ ఈడిగ కులస్తుల ఆహుతితో అమ్మవారికి శాంతి ఉంటుంది. 23వ తేదీ ఉదయం నుంచి భక్తుల బోనాల సమర్పణ, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వంద శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలు అందజేత

దేవనకొండ: మండలంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వంద శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను చిన్న, సన్నకారు రైతులకు అందజేస్తున్నట్లు ఏపీఎం క్రిష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, తైవాన్‌జామ, కొబ్బరి, సపోటా, చింత, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, అంజీర, ఆపిల్‌బేర్, గులాబీ, మునగ, మల్లె, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల, పూల మొక్కలను వంద శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు స్థానిక కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా ఉండండి

హొళగుంద: వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో నీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌లీల మంగళవారం సూచించారు. తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయించి, ప్రతి రోజు నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. డ్రైనేజీలు, గుంతల్లో తాగునీటి పైప్‌లైన్లు ఉంటే వెంటనే మార్చాలని లేదా నీరు కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వలు ఉన్న చోట, ఇళ్ల ముందు పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వేరుశనగ కాయలకు పేర్లు నమోదు చేసుకోండి

హాలహర్వి: ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగకాయలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేరుశనగ రకం (కే6) క్వింటాల్ ధర రూ.9,500 ఉండగా సబ్సిడీ రూ.3,800 పోనూ రైతు రూ.5,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్ నంబర్‌తో ఆర్‌బీకేలకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

జోరందుకున్న ఖరీఫ్ పనులు

చిప్పగిరి: వారం రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. రైతులు తమ పొలాలను దుక్కి దున్నడం, ఎరువులు చల్లడం , భూమి చదును చేయడం లాంటి పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పెట్టుబడులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వేరుశెనగ, కంది, పత్తి, కొర్ర ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

వాహనాల తనిఖీ

డోన్ టౌన్ : అక్రమంగా ప్రయాణికులను తరలించే వాహనాలను మంగళవారం ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తనిఖీ చేశారు. పట్టణ సమీపంలోని కొట్లవారిపల్లె సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బేతంచెర్ల, రాయలచెరువు, జలదుర్గం తదితర రూట్లలో వచ్చే పోయ్యే వాహనాలను తనిఖీ చేశారు. సరియైన పత్రాలు లేని, కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలించే వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. 15 వాహనాలను సీజ్ చేసి రూ.48,700 అపరాధ రుసుం వేసినట్లు అధికారులు తెలిపారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- 25 శాతం సీట్లు కేటాయింపు
- నియోజకవర్గంలో 116 మంది విద్యార్థులు ఎంపిక
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో పేద విద్యార్థులకు మేలు



పాఠాలు వింటున్న విద్యార్థులు(ఫైల్)

ఆలూరు రూరల్: విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారింది. విద్యాహక్కు చట్టం 12(1)సీ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలలు ఈ మేరకు వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించారు. పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన విద్యార్థుల జాబితా విద్యాశాఖ విడుదల చేసింది. మొదటి విడత కింద నియోజకవర్గంలో 116 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు ప్రవేశాలు కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు ప్రాధాన్యం ఉంటుంది. ఉచిత ప్రవేశాలకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

పక్కాగా అమలు

టీడీపీ ప్రభుత్వం హయాంలో విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసింది. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితం అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2020–22 విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేసింది. 2024–25 ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో 116 మందిని ఎంపిక చేశారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 సీట్లు కేటాయించారు. స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్లు, నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించింది. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేశారు.

2024–25 విద్యా సంవత్సరానికి

విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం ఏటా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో ఇప్పటి నుంచే చర్యలు తీసుకున్నారు. సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న ప్రైవేటు పాఠశాల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించారు.

మండలాల వారిగా సీట్లు కేటాయించిన విద్యార్థుల సంఖ్య

మండలం పేరు	ఎంపికైన విద్యార్థుల సంఖ్య
ఆలూరు	54
ఆస్పరి	14
చిప్పగిరి	8
హాలహర్వి	3
హొళగుంద	16
దేవనకొండ	21

పేద విద్యార్థులకు వరం



విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఒక వరం. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు దరఖాస్తు చేస్తుకున్న విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాం. పేద కుటుంబాల విద్యార్థులతో పాటు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ,హెచ్ఐవీ బాధితుల పిల్లలు అర్హులుగా గుర్తించాం.

– కోమలాదేవి, ఎంఈఓ, ఆలూరు

నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



నారాయణరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కుటుంబ సభ్యులు

వెల్దుర్తి(కృష్ణగిరి): తన భర్త, దివంగత వైఎస్సార్‌సీపీ నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో ఆమె వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలోని సమాధికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బోయ సాంబశివుడు చిత్ర పటానికి కూడా శ్రీదేవి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కోసం ఆయన చేసిన సేవలను శ్రీదేవి కొనియాడారు. తన భర్త ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటే ప్రజానేతగా ఎదిగారన్నారు. ఆయన ఆశయ సాధనలో తాను ప్రజాసేవకు అంకితమయ్యానన్నారు. 2014 ఎన్నికల్లో ఫ్యాక్షన్ రాజకీయాలకు చరమగీతం పాడి తనను ఆశీర్వదించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించానని, మరో మారు ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా విజయం సాధించబోతున్నానన్నారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీదేవి కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, వెల్దుర్తి సొసైటీ చైర్మన్ వంశీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు తుగ్గలి మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, పెండేకల్ భాస్కర్‌రెడ్డి, పీఎండీ హుసేన్, రాతన మోహన్‌రెడ్డి, తుగ్గలి మండల కన్వీనర్ జిట్టా నాగేష్, హనుమంతు, పగిడిరాయి జగన్నాథ రెడ్డి, కడమకుంట్ల అమర్నాథరెడ్డి, శ్రీరంగడు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, శిగరమాను కృష్ణమూర్తి,పోతురెడ్డి, మహేశ్వరరెడ్డి, ప్రహ్లాద ఉన్నారు.

మద్దికెరలో..

మద్దికెర: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చెరుకులపాడు నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పెరవలి సర్పంచ్ మల్లికార్జున, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, గంపల వెంకటేశులు, ఆంజనేయులు, రామకృష్ణ, ఖాజావలి, బండారు అంజనేయులు, శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, కిట్టి, నాగేష్, రామాంజులు, విష్ణు, కృష్ణ, తాలూరి వెంకటేశ్వర రెడ్డి, తిమ్మయ్య, వరప్రసాద్, దేవేంద్ర, దానవేంద్ర, మంజునాథ్‌రెడ్డి, చంద్ర, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండలో నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జొన్నగిరిలో ..

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో మంగళవారం దివంగత నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రఘు, భాస్కర్‌రెడ్డి, తేరప్ప, గోవిందురాజులు తదితరులు పాల్గొన్నారు.



నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పత్తికొండలో..

పత్తికొండ రూరల్: దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, సర్పంచులు కేశవరెడ్డి, శ్రీరాములు, నాయకులు తిప్పయ్య, నాగరాజు, లక్ష్మినాయక్, బనగాని శ్రీను, హుసేన్, రవిరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆలూరు: వచ్చే నెల 4 జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు సందర్భంగా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటరి్నంగ్ అధికారి డి.రామునాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు, ఏజెంట్లు, ఎన్నికల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరచిన పోస్టుల్ బ్యాలెట్ బాక్స్‌లను తరలించే ముందు 3వ తేదీ అన్ని రాజకీయ పార్టీల నాయకులు మరోసారి పరిశీలించుకునేందుకు అవకాశం ఇస్తామన్నారు. కౌంటింగ్ సమయంలో 14 (రౌండ్లు) టేబుల్‌ను ఏర్పాటు చేస్తుండటంతో ప్రతి రాజకీయ పార్టీ అభ్యర్థి 14 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, జైలు శిక్ష అనుభవించిన వారు ఏజెంట్లుగా నియమించుకోరాదన్నారు. 4న ఉదయం 6 గంటలకు కౌంటింగ్‌హాల్‌కు ఏజెంట్లు చేరుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎలెక్షన్ డీటీ గుండాల నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఓ. డి.రామునాయక్

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

మద్దికెర: కోతల తరువాత పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నడంతో సేంద్రియ ఎరువుగా మారి భూమి సారవంతం అవుతుందని ఏఓ రవి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్బీకేలో తొలకరి సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనా సేకరణకు, భూసార పరీక్షలకు ఇదే సరైన సమయమని, రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. ఫలితాలను బట్టి పంటను సాగుచేసుకోవాలన్నారు. విత్తన ఎంపికలో కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. శుద్ధి చేసిన విత్తనాలను అనుమతులున్న డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు జాకీర్, ఆనంద్ ఉన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

కృష్ణగిరి: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో సబ్సిడీ వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు ం రోజుల్లో అన్ని ఆర్బీకేలకు సబ్సిడీ వేరుశనగ కాయలు వస్తాయని, త్వరలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. గ్రామాల్లో బోరు, బావుల కింద వేరుశనగ, పత్తి సాగు చేపట్టారని, ఎండలు అధికంగా ఉండటంతో మొలక శాతం తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల చివర్లో లేదా జూన్ మొదటి వారంలో విత్తనం వేస్తే మంచి ఫలితం ఉంటుందని ఆయన రైతులకు సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం

– చెట్టులో చొచ్చుకుపోయిన విద్యుత్ తీగలు

ఆలూరు రూరల్: ఆలూరు–హొళగుంద రహదారిలోని బిలేహాల్ బస్ స్టేజ్ సమీపంలో ఉన్న దానిమ్మ తోట వద్ద చింత చెట్టులోకి 11 కేవీ ఫీడర్ విద్యుత్ తీగలు చొచ్చుకుపోయి ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తూ..ఈ చెట్టు కింద సేదతీరుతూ ఉంటారు. వర్షాకాలం కావడంతో గాలివాన వచ్చినప్పుడు చెట్టు కొమ్మలపై వేటాడుతున్న విద్యుత్ తీగల వల్ల చెట్టుకు కరెంటు సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. 11 కేవీ విద్యుత్ ఫీడర్ నుంచి హాలహర్వి మండలంలోని బిలేహాల్, నిట్రవట్టి గ్రామాలతో పాటు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. గాలికి విద్యుత్ తీగలు చెట్టు కొమ్మలకు తాకి బ్రేక్ డౌన్ అవుతుండడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రీ కటింగ్ చేసి తీగలు సరిచేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.



చెట్టు కొమ్మల మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ తీగలు

ఈదురు గాలుల బీభత్సం

– నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఆస్పరి: మండలంలోని చెన్నంపల్లి, వెంగళాయిదొడ్డి గ్రామాల మధ్య మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అక్కడక్కడా చెట్లు విరగడపడటంతో విద్యుత్ తీగలు దెబ్బతిన్నాయి. ఫలితంగా కై రుప్పల, చెన్నంపల్లి, వెంగళాయిదొడ్డి, కారుమంచి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలకు బుధవారం మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ మలికార్జున తెలిపారు.





చెన్నంపల్లి వద్ద నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు, తీగలు

కోలుకోలేక వ్యక్తి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెల్దుర్తి మండలం గుంటుపల్లె గ్రామానికి చెందిన వడ్డె ధనాంజనేయులు(31) కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ధనాంజనేయులు తాగుడుకు బానిస అయ్యాడు. మరోపక్క రూ.6 లక్షల అప్పు చేశాడు. వీటిని తీర్చే దారి లేక ఈనెల 10న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. మృతుడికి ఏడాది క్రితం వివాహం కాగా భార్య ప్రస్తుతం గర్భిణి. మృతుడి సోదరుడు వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ నియంత్రికకు తగిలి గొర్రె మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని సిద్ధనగట్టు గ్రామంలో గోపాల్‌కు చెందిన గొర్రె విద్యుత్ నియంత్రికకు తగిలి మృతి చెందింది. వాగులో నీరు తాగేందుకు వెళ్లిన సమయంలో గొర్రెలు ప్రమాదవశాత్తూ విద్యుత్ నియంత్రికకు తగిలాయి. ఒక గొర్రె మృతి చెందగా మరో రెండు గొర్రెలు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. దాదాపు రూ.15 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పత్తికొండ రూరల్: రైతులకు ప్యాకెట్‌పై ముద్రించిన ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ మోహన విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడుతో కలిసి పత్తికొండలోని కిరణ్‌హైబ్రిడ్స్, కోరమాండల్, మన గ్రోమోర్ సెంటర్లను తనిఖీ చేశారు. పత్తి, కంది, ఆముదం, జొన్న తదితర విత్తనాలను రైతులకు ఎమ్మార్పీకే విక్రయించి రసీదులను ఇవ్వాలన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టిస్తే క్రిమినల్ చర్యలతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని నూలుమిల్లు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన యాటగిరి సుధాకర్, మధుకుమార్ బైక్‌పై నంద్యాలకు వెళ్తుండగా వెనుక వస్తున్న ఢీకొందన్నారు. ఈ ఘటనలో సుధాకర్‌ర, మధుకుమార్‌కు గాయాలు కావడంతో శాంతిరాం ఆసుపత్రికి తలించారు. బైక్‌ను ఢీకొన్న కారు అతివేగంగా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. హైవే పెట్రోల్ సిబ్బంది హైవేపై ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

భక్తులతో కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్దఎత్తున తరలివచ్చి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్‌లు ఏర్పాట్లు చేశారు.వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

- నూనెగింజల పంటల్లో అంతర పంటలు సాగు ఎంతో మేలు
- ఖరీఫ్ సీజన్ పంటలపై రైతులకు అవగాహన అవసరం
- వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సాంకేతిక వ్యవసాయాధి అధికారి దస్తగిరిరెడ్డి



పత్తికొండ మండల పరిధిలో సజ్జలో అంతర పంటగా సాగైన కంది

కర్నూలు(అగ్రికల్చర్): అనాదిగా నూనెగింజల పంటలు వర్షాధారంగా మెట్ట భూముల్లో సాగు చేయబడుతున్నాయి. పలు పంటల సరుకుల్లో నూనెగింజల పైర్ల ప్రాముఖ్యత ఎంతో ఉంది. మెట్ట వ్యవసాయ ప్రాంతాల్లో వర్షపాతాన్ని బట్టి పైర్లు వివిధ దశల్లో అనావృష్టి (బెట్ట) పరిస్థితులనెదుర్కొంటూ ఉంటాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడులతో పాటు స్థిరమైన లాభాలను ఆర్జించే విషయంలో నూనెగింజల పైర్లతో కూడిన అంతర పంటలు దోహదపడుతున్నాయి. జిల్లాలో అనువైన సిఫారసు చేయబడిన లాభసాటి అయిన ఆముదం, ప్రొద్దుతిరుగుడులతో కూడిన అంతర పంటల గురించిన విషయ పరిజ్ఞానం మెట్ట రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నూనెగింజల పంటల్లో వేసుకోవాల్సిన అంతర పంటల గురించి వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సాంకేతిక అధికారి దస్తగిరిరెడ్డి వివరించారు. అంతర పంటల వల్ల అదనపు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.

● ఆముదంలో కంది..

ఈ పైర్లను 1:1 నిష్పత్తిలో విత్తుకోవాలి. ఆముదాన్ని 20 సెంటీమీటర్లు ఎడం సాళ్లలో విత్తుకోవాలి. మొక్కల మధ్య 60 సెంటీమీటర్ల ఎడం ఉంచుకోవాలి. దుక్కిలో హెక్టారుకు 40 కిలోల నత్రజని, 40 కిలోల బాస్వరం, 30 కిలోల పొటాష్ వేయాలి. ఆముదం విత్తన 40 రోజులకు 20 కిలోల నత్రజని, ఆముదానికి మాత్రమే వేయాలి.

● ఆముదంలో పెసర/అలసంద/సోయాచిక్కుడు

ఈ పంటలను 1:2 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. 90 సెం.మీ ఎడంలో ఆముదం విత్తనాన్ని వేసుకోవాలి. ఆముదం సాళ్ల మధ్యలో రెండుసాళ్ల అంతర పంటలు వేసుకోవచ్చు. పెసర 70 రోజుల్లో అలసంద 90 రోజుల్లో, సోయాబీన్ 90 రోజుల్లో కోతకు వస్తాయి. అలసందను కూరకు గానీ విత్తనానికి గానీ వాడుకోవచ్చు. ఆముదానికి దుక్కిలో హెక్టారు 40 కిలోల నత్రజని, 40 కిలోల బాస్వరం, 30 కిలోల పొటాష్‌లనిచ్చే ఎరువులను వేసుకోవాలి. విత్తిన 40 రోజులకు హెక్టారుకు 20 కిలోల నత్రజనిని ఆముదానికి వేయాలి. గోరుచిక్కుడు అంతర పంటగా పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లోని రైతాంగానికి లాభసాటిగా ఉంటుంది.

● ఆముదంలో వేరుశెనగ

ఈ పైర్లను 1:5 నిష్పత్తిలో సాగు చేయాలి. ప్రతి ఐదు సాళ్ల వేరుశెనగ తర్వాత ఒక సాలు ఆముదం విత్తుకోవాలి. దుక్కిలో హెక్టారుకు 30 కిలోల నత్రజని, 60 కిలోల బాస్వరం, 30 కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. విత్తిన 40 రోజులకు 20 కిలోల నత్రజనిని ఆముదం పేరుకు పైపాటుకు అందించాలి. వేరుశెనగకు హెక్టారుకు 500 కిలోల జిప్సం పూత సమయంలో వేర్లకు దగ్గరగా వేయాలి.

● ఆముదంలో ప్రొద్దుతిరుగుడు..

ఈ పైర్లను 1:1 నిష్పత్తిలో వేయాలి. రెండు ఆముదం సాళ్ల మధ్య ఒక వరుస ప్రొద్దుతిరుగుడు పంట వేసుకోవాలి. చివరి దుక్కిలో హెక్టారుకు 40 కిలోల నత్రజని, 40 కిలోల బాస్వరం, 30 కిలో పొటాష్‌లను వేసుకుని, విత్తన 40 రోజులకు 20 కిలోల నత్రజనిని పైపాటుగా రెండు పంటలకు వేయాలి.

● ప్రొద్దుతిరుగుడులో వేరుశెనగ..

ఈ పైర్లను 6:2 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. చివరి దుక్కిలో హెక్టారుకు 30 కిలోల నత్రజని, 60 కిలోల బాస్వరం, 30 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి. విత్తిన పది రోజులకు 10 కిలోల నత్రజని ప్రొద్దుతిరుగుడుకు వేయాలి. వేరుశెనగకు పూత సమయంలో 50 కిలోల జిప్సం వేయడం వల్ల గింజ బాగా కడుతుంది.

● పొద్దుతిరుగుడులో కంది..

ఈ పంటలను 1:1 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. ప్రొద్దుతిరుగుడు కోసిన తర్వాత కంది ఏపుగా పెరిగి, మంచి దిగుబడినిస్తుంది. విత్తిన 30 రోజులకు హెక్టారుకు 10 కిలోల నత్రజనిని ప్రొద్దుతిరుగుడుకు వేయాలి.

● ప్రొద్దుతిరుగుడులో మినుము /పెసర/సోయాబీన్

ఈ పైర్లను 1:2 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. ఒక సాలు ప్రొద్దుతిరుగుడు తర్వాత రెండుసాళ్ల ఈ అపరాల జాతికి చెందిన పైర్లను సాగు చేసుకుంటే భూమికి బాగా సత్తువ ఏర్పడి ప్రొద్దుతిరుగుడు దిగుబడులపై ఏమాత్రం చెడు ప్రభావం ఉండదు. విత్తిన 30 రోజులకు ప్రొద్దుతిరుగుడు మాత్రం 20 కిలోల నత్రజని నిసై పాటుగా వేయాలి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఈ విధమైన అంతర పంటల విధానాలను రైతులు అవలంబినట్లయితే రైతులు వేసుకునే ప్రధాన పంట దిగుబడులకు అవరోధం లేకుండా అంతర పంటల నుంచి దిగుబడులను ఇతోధికంగా పొందవచ్చు. తద్వారా నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చు.